క్లుప్తంగా

బుక్‌కీపర్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

గన్నవరం: మండలంలోని చిక్కవరంలో బుక్ కీపర్ అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం సమత గ్రామైక్య సంఘ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. బుక్‌కీపర్ పీకా నరసమ్మ వెలుగు కార్యాలయ అధికారులు, సిబ్బంది అండదండలతో డ్వాక్రా సభ్యుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిపారు. శ్రీనిధి, ఇతర రుణాలు మంజూరు చేసేందుకు గ్రూపుల నుంచి నగదు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. తన కుటుంబ సభ్యులు, బంధువులు చెల్లించాల్సిన రుణ బకాయిలను వడ్డీతో సహా కట్టాలని తమపై భారం వేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైన బుక్‌కీపర్‌తో పాటు కంప్యూటర్ ఆపరేటర్, వెలుగు సీసీపై విచారణ చేయాలని కోరారు.

విధులను బహిష్కరించిన న్యాయవాదులు

గన్నవరం: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై దాడి యత్నానికి నిరసనగా గన్నవరం న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరించారు. కోర్టు ఆవరణలో తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడే ఎ. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం సీజేఐపై న్యాయవాది రాకేష్ కిశోర్ దాడికి యత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సంఘటనను రాజ్యాంగంపై జరిగిన దాడిగా పరిగణించాలని అన్నారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని పూజలు చేశారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో దాతలు కాళ్ల మల్లికార్జునరావు, రాధిక దంపతుల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు, ఈఓ పితాని తారకేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అవగాహనతోనే క్యాన్సర్‌ను ఎదుర్కోగలం



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): అవగాహనతోనే క్యాన్సర్‌ను ఎదుర్కోగలమని క్యాన్సర్ వైద్య నిపుణురాలు చందన వేమూరి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ ఆధ్వర్యంలో మొగల్రాజపురంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా చందన మాట్లాడుతూ క్యాన్సర్‌పై ఉన్న భయాలను వీడి అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

లయన్స్ ఇంటర్నేషనల్ (జిల్లా-316డీ) గవర్నర్ వీవీపీఎస్.ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం, క్యాన్సర్‌పై అవగాహనకు ఇలాంటి సదస్సులు చాలా దోహదం చేస్తాయన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ సెకండ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, లయన్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ జిల్లా గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అవగాహనా ద్వారానే క్యాన్సర్ నుంచి తప్పించుకోగలమన్నారు. మానసిక వైద్యులు ఆక్కే అయోధ్య, బి.అనిత మానసిక ఆరోగ్యం అంశంపై మాట్లాడారు. లయన్స్ సభ్యులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, బొబ్బా హరినాథ్ బాబుతో పాటు లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ అధ్యక్షుడు వి.మహేంద్రరెడ్డి, కార్యదర్శి కొత్తా శివ, కోశాధికారి తిరుపతి విజయ్‌కుమార్, లయన్స్ ప్రోగ్రామ్ కమిటీ చైర్‌పర్సన్లు తోటా నాగేశ్వరరావు, వేమూరి రవికుమార్ పాల్గొన్నారు. సదస్సు అనంతరం క్లబ్ సభ్యులు వైద్యులను సత్కరించారు.

వాటర్ పైప్‌లైన్‌కు మరమ్మతులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు ప్రధాన గ్రామం, రామానగర్‌లో మంగళవారం వాటర్ పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహించారు. వాటర్ పైప్‌లైన్లు లీక్‌లు ఏర్పడి తాగునీరు వృధాగా పోతున్న విషయాన్ని పంచాయతీ సర్పంచ్ శీలం రంగారావు దృష్టికి తీసుకెళ్లడంతో ఈ మరమ్మతులు చేపట్టారు. గ్రామంలో పలు చోట్ల పంచాయతీ కుళాయిలకు హెడ్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాల్వ గట్టు ప్రాంతాల్లో మోటారు బోర్ల సాయంతో తాగునీరు అందిస్తున్నామన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు పలు చోట్ల వీధి కుళాయిలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతి

- ప్రమాదకరంగా బుడమేరు వంతెన
- ధ్వంసమైన ఇనుప రెయిలింగ్‌లు
- భయాందోళనలో వాహనదారులు



ఉప్పలూరు - కేసరపల్లి మధ్య వంతెనపై ధ్వంసమైన ఇనుప రెయిలింగ్

కంకిపాడు: బుడమేరు వంతెనపై డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. ఎప్పుడెలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనన్న భయంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. వంతెన పరిసరాలు ప్రమాదకరంగా తయారైనా అధికారుల్లో కానీ, పాలకుల్లో కానీ చలనం లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

కంకిపాడు, గన్నవరం మండలాల మధ్య బెజవాడ దుఃఖదాయిని బుడమేరు ప్రవహిస్తోంది. దీనికి ఉప్పలూరు - కేసరపల్లి గ్రామాల మధ్య రోడ్డు వంతెన ఉంది. విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారి, ఏలూరు జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న ప్రధాన రహదారి ఇది. ఎయిర్ పోర్టు, ఇతర ప్రాంతాలకు చేరుకోవడానికి ప్రజలు ఈ మార్గాన్నే వినియోగిస్తుంటారు. దీన్ని బట్టి ఈ రోడ్డు ఎంతటి ప్రాధాన్యత గలదో అర్థం చేసుకోవచ్చు.

రక్షణ చర్యలు శూన్యం

ప్రస్తుతం ఉన్న వంతెనకు వాహనదారుల భద్రత నిమిత్తం ఏర్పాటుచేసిన ఇనుప రెయిలింగ్ ఇరువైపులా పూర్తిగా ధ్వంసమైంది. భారీ వాహనాల ధాటికి విరిగిపోయాయి. వాహనదారుల భద్రతకు ఎలాంటి రక్షణ లేకుండా పోయింది. అజాగ్రత్తగా వాహనాలు నడిపితే నేరుగా బుడమేరులో వాహనాలు పడిపోయి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. అత్యంత ప్రమాదకరంగా మారిన వంతెన మీదుగా రాకపోకలు సాగించాలంటేనే వాహనదారులు భయంతో వణికిపోతున్నారు.

పట్టించుకోని పాలకులు, అధికారులు

వంతెన ప్రమాదకరంగా మారినా, రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా కూటమి నేతల్లో మాత్రం కదలిక లేదు. ప్రభుత్వం వంతెన అభివృద్ధిపై దృష్టి సారించడం లేదు. అధికారులు మాత్రం ఉప్పలూరు, బుడమేరు వంతెన, కేసరపల్లి వంతెన అభివృద్ధికి రూ.125 కోట్లతో అంచనాలు నివేదించామని చెబుతున్నారే తప్ప నిధులు మాత్రం విడుదల కావడం లేదు. దీంతో వంతెన అభివృద్ధి అంశం పరిష్కారానికి నోచని సమస్యగా తయారైంది. ఇప్పటికైనా వంతెన అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వరదలు వస్తే రాకపోకలు బంద్

బుడమేరుకు వరదలు వచ్చిన ప్రతిసారీ రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేవలం బుడమేరుపై రోడ్డు వంతెన మాత్రమే నిర్మితమైంది. దీంతో వరద వస్తే బుడమేరు నీరు ఏకంగా రోడ్డుపై ప్రవహిస్తుంది. అంతే కాకుండా కొన్ని రోజుల పాటు నీరు రోడ్డు మీదే పారుదల అవుతుండటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో ప్రత్యామ్నాయంగా వేల్పూరు, గూడవల్లి మీదుగా ప్రయాణించి గమ్యం చేరుకోవాల్సి వస్తోంది. ఈ సమస్యను అధికమించాలంటే బుడమేరుపై వంతెన ఎత్తు పెంచడం ఎంతో అవసరం.

మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం



గన్నవరంలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు



ఉంగుటూరులో పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈఓ

గన్నవరం: స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యాన మండల స్థాయి క్రీడా పోటీలను మంగళవారం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని మండల క్రీడా సమన్వయకర్త డి. నాగరాజు తెలిపారు. తొలిరోజు బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం ఎ. సునీల్, సబ్ జోన్ కార్యదర్శి ఎస్. వెంకటేశ్వరరావు, పలువురు వ్యాయామ విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత ఆత్కూరు హైస్కూల్

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌లో ఆటల పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు బాలుర విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్ పోటీలను నిర్వహించారు. కబడ్డీ అండర్-14, 17 విజేతలుగా ఆత్కూరు హైస్కూల్, రన్నర్‌గా తేలప్రోలు హైస్కూల్ జట్లు నిలిచాయి. ఖోఖో అండర్-14, 17 విజేతలుగా తేలప్రోలు హైస్కూల్, రన్నర్‌గా ఉంగుటూరు హైస్కూల్ జట్లు నిలిచినట్లు హెచ్‌ఎం సి.హెచ్. అనిత తెలిపారు. చెస్ అండర్-17లో ఉంగుటూరు హైస్కూల్ విజేతగా, ఆత్కూరు హైస్కూల్ రన్నర్‌గా, అండర్-14లో సెయింట్ ఆంథోని స్కూల్, ఆత్కూరు ప్రథమ స్థానం, ఉంగుటూరు హైస్కూల్ ద్వితీయ స్థానం సాధించినట్లు చెప్పారు. ఎంఈఓ-2 జె. సాంబశివరావు, సర్పంచి కాటూరి వరప్రసాద్, ఎస్‌ఎంసీ చైర్మన్ పి. శ్రీనివాసరావు, పీఈటీ ఎస్. కాంతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం జరిగిన ఆటల పోటీలకు దాదాపు 300 మంది హాజరయ్యారు. బాపులపాడు ఎంఈఓ శ్రీరామ్ బాలాసింగ్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావుల చేతుల మీదగా పోటీలు ప్రారంభించారు. బాపులపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్, మండల స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి బీఎస్ రామచంద్రుడు, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, శ్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

గొల్లనపల్లి హైస్కూల్‌కు స్వచ్ఛ పురస్కారం



హెచ్‌ఎం జగదీశ్వరరావుకు పురస్కారం అందజేస్తున్న మంత్రి సుభాష్, కలెక్టర్ బాలాజీ



అవార్డు అందుకుంటున్న యూపీహెచ్‌సీ వైద్యుడు వజ్రకుమార్



అవార్డు అందుకుంటున్న పెనమలూరు హెచ్‌ఎం సుధారాణి

గన్నవరం రూరల్: మండలంలోని గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్‌కు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర-2025 జిల్లా స్థాయి పురస్కారం లభించింది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ డీకే బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ చేతుల మీదుగా సోమవారం హైస్కూల్ హెచ్‌ఎం కె.ఎస్. జగదీశ్వరరావు అవార్డు అందుకున్నారు. పాఠశాల ఆవరణలో డస్ట్‌బిన్‌ల ఏర్పాటు, టాయిలెట్లు నిర్వహణ, హ్యాండ్‌వాష్ ఏరియాల్లో బాలబాలికలకు, దివ్యాంగులకు పరిశుభ్రత ఏర్పాట్లు కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న పాఠశాల యాజమాన్యం చొరవను అభినందించారు. వర్షం నీరు సంరక్షణ, వాటి వినియోగంతో మొక్కల పెంపకం, విద్యార్థులతో ఎకో క్లబ్‌ల ఏర్పాటు, పర్యావరణం వంటి చర్యలు పాఠశాలకు పురస్కారం తెచ్చాయని హెచ్‌ఎం జగదీశ్వరరావు తెలిపారు.

యూపీహెచ్‌సీ, పెనమలూరు జెడ్పీ హైస్కూల్‌కు అవార్డులు

పెనమలూరు: స్వచ్ఛాంధ్ర అవార్డులను యనమలకుదురు అర్బన్ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ), పెనమలూరు జెడ్పీ హైస్కూల్‌కు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి శుభాష్ అందజేశారు. మచిలీపట్నంలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో యనమలకుదురు యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ కె.నాగవజ్రకుమార్, ఎ.రమాదేవిలకు అవార్డు ప్రదానం చేశారు. అదేవిధంగా జిల్లాలో ఉత్తమ స్వచ్ఛ పాఠశాలగా పెనమలూరు జెడ్పీ హైస్కూల్‌కు అవార్డు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం జీబీకే సుధారాణికి అవార్డు మంత్రి నుంచి అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'ప్రాజెక్టు కామధేను'కు అవార్డు



స్వచ్ఛాంధ్ర అవార్డుతో కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్, అధికారులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్వచ్ఛాంధ్ర అవార్డు-2025ను కృష్ణామిల్క్ యూనియన్‌కు చెందిన 'ప్రాజెక్టు కామధేను' పాల ఉత్పత్తుల ఫ్యాక్టరీ దక్కించుకుంది. బాపులపాడు మండలం వీరవల్లిలోని 'ప్రాజెక్టు కామధేను' ఫ్యాక్టరీ ప్రాంగణంలో యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఫ్యాక్టరీ ఉద్యోగులు, కార్మికులను అభినందించారు. యూనియన్ పాలకవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు, అధికారులు పాల్గొన్నారు.

మంచి ఆహారంతోనే ఆరోగ్యం

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థి దశ నుంచే మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం పొందగలమని సమగ్ర శిక్ష కెరీర్ గైడెన్స్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ బెజవాడ దీప్తి పేర్కొన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. 'ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు - మానసిక ఆర్యోగంపై వాటి ప్రభావం' అనే అంశంపై ఆమె ప్రసంగించారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడే ఆహార పదార్థాలను విద్యార్థులకు వివరించారు. ప్రతిరోజూ వ్యాయామం, ధ్యానం చేయడం, తగినంత ప్రశాంతమైన నిద్ర ద్వారా మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చని తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.నిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొల్లపూడి కాల్వ కట్ట.. డంపింగ్‌కు అడ్డా



అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామంలోని గొల్లపూడి కాల్వ కట్ట వ్యర్థాల డంపింగ్‌కు కేరాఫ్‌గా మారింది. అంబాపురం గ్రామం విజయవాడ నగరానికి దగ్గర ఉండటంతో వ్యర్థాలను బీసీ స్మశానవాటిక సమీపంలోని కాల్వ కట్టకు తీసుకొచ్చి డంప్ చేస్తున్నారు. ఫర్నిచర్ కంపెనీల్లోని వ్యర్థాలు, చెప్పులు తయారీ వ్యర్థాలు, ఆసుపత్రుల్లో వ్యర్థాలు సైతం కాల్వ కట్టపై రాత్రి సమయాల్లో డంప్ చేస్తున్నారు. వ్యర్థాల నుంచి దుర్వాసనలు వస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతేకాక వ్యర్థాలు గొల్లపూడి కాల్వలో పడి నీరు కలుషితం అవుతున్నాయి. అదే నీటిని నున్న గ్రామస్థులు ఫిల్టర్ చేసుకొని తాగునీటిగా ఉపయోగిస్తున్నారు. వ్యర్థాలను డంప్ చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని అనేకసార్లు ఎంపీడీఓ, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వాల్మీకి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీ రాజశేఖరబాబు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వేటగాడు రత్నాకరుడు మహర్షి వాల్మీకిగా మారిన వృత్తాంతం మనిషిలో మార్పు వస్తే మహర్షి కాగలరని నిరూపించినట్లు విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. ఆ మహనీయుని జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని, జీవితంలో ధర్మబద్ధంగా ముందుకు సాగాలి పిలుపునిచ్చారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆయన పోలీస్ కమిషనరేట్‌లో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. యుగాలు మారినా చెక్కుచెదరని కుటుంబ విలువలు, ధర్మం, మానవ సంబంధాలను బోధించే ఉన్నతమైన ఆదర్శ కావ్యంగా రామాయణాన్ని వాల్మీకి మహర్షి సమాజానికి అందించారని చెప్పారు. రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ కుటుంబ, మానవతా విలువలను పెంపొందించుకోవాలని ధర్మబద్ధంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వార్డుల పునర్విభజనపై వాడీవేడి చర్చ

- సూచనలు, ప్రతిపాదనలతో సభ్యుల అభ్యంతరం
- సమగ్రంగా పునర్విభజన చేయాలంటూ డిమాండ్
- ఆమోద తీర్మానం తిరస్కరణ



వార్డుల పునర్విభజన అంశంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న సభ్యులు

ఉయ్యూరు: వార్డుల పునర్విభజన అంశంపై కౌన్సిల్‌లో సభ్యులు ధ్వజమెత్తారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా వార్డుల విభజన లేకపోతే ఎలా అని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. వార్డులను ప్రణాళికాబద్ధంగా, ఆమోదయోగ్యంగా ఉన్న తర్వాతే ఆమోదిస్తామంటూ ఏకగ్రీవంగా తీర్మానించారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం మున్సిపల్ అత్యవసర, ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వార్డుల పునర్విభజన, అభివృద్ధి అంశాలను కౌన్సిల్ ముందుంచారు.

పునర్విభజనపై అభ్యంతరం

అజెండాలోని అభివృద్ధి పనులను ఆమోదించిన సభ్యులు పునర్విభజన అంశంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసా బేగంతో పాటుగా పలువురు సభ్యులు వార్డుల విభజన అశాస్త్రీయంగా ఉందని ధ్వజమెత్తారు. మరోసారి అందరితో చర్చించి సంపూర్ణంగా ఉన్న తర్వాతే కౌన్సిల్ ముందుంచాలని సూచించారు. ఆయా వార్డులకు సంబంధించిన అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా చైర్మన్‌కు అందజేశారు. సభ్యులందరి అభ్యంతరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని సమగ్రంగా వార్డుల పునర్విభజన ఉండాలని చైర్మన్ సత్యనారాయణ అధికారులకు సూచించారు.

బ్లూ ప్రింట్ ప్రదర్శించండి

మున్సిపల్ పాలకవర్గం ఏర్పడి ఐదేళ్లు పూర్తికావస్తున్నా బ్లూ ప్రింట్ ఏర్పాటు చేయడం లేదని 16వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ జంపాన పూర్ణిమ అన్నారు. బ్లూ ప్రింట్ ద్వారా ఉయ్యూరు ముఖచిత్రం ప్రదర్శిస్తే సామాజిక స్థలాలు రక్షించబడతాయని పేర్కొన్నారు. పాలకవర్గం గడువు పూర్తయ్యేలోగా బ్లూ ప్రింట్ ఏర్పాటుచేయాలని సూచించారు. సమావేశంలో కమిషనర్ జాస్తి రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రుణాల మంజూరు జాప్యంపై విచారణ



విచారణ అధికారి నాగవెంకట ప్రసాద్‌కు వివరాలు అందజేస్తున్న ఆర్టీఐ కార్యకర్తలు

ఉయ్యూరు: బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ రుణాల మంజూరులో జాప్యంపై వచ్చిన ఫిర్యాదుపై బీసీ కార్పొరేషన్ కార్యాలయ అధికారి సమ్మిట నాగ వెంకట ప్రసాద్ మంగళవారం ఉయ్యూరులో యుఎఫ్ ఆర్టీఐ కార్యాలయానికి వచ్చి విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారు యుఎఫ్ ఆర్టీఐ రాష్ట్ర కోకన్వీనర్ జంపాన శ్రీనివాసగౌడ్ నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీ కార్పొరేషన్ ద్వారా రూ. 896.09 కోట్లు కేటాయించిందన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాకు రూ. 117.65 కోట్లు కేటాయింపు జరిగిందన్నారు. ఈ రుణాల కోసం లబ్ధిదారులు అర్జీలు పెట్టి ఇంటర్వ్యూలకు కూడా హాజరయ్యారన్నారు. ఒక్కో అర్జీదారుకు రూ. 500 నుంచి రూ. 1000 వరకూ ఖర్చు అయ్యిందన్నారు. అయితే దరఖాస్తులు పెట్టి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఏ ఒక్క లబ్ధిదారుడికీ రుణం మంజూరు కాలేదన్నారు. సీఎం, డెప్యూటీ సీఎం స్పందించి రుణాలు మంజూరు చేయాలని కోరారు. విచారణలో కార్యకర్తలు బేతపూడి జోగేశ్వరరావు, బయ్యవరపు దుర్గాప్రసాద్, మరీదు సాంబశివరావు, బొల్లా శివపార్వతి పాల్గొన్నారు.

వరిలో తెగుళ్ల నివారణపై రైతులకు శిక్షణ



రైతులకు సూచనలు ఇస్తున్న డీడీఏ జ్యోతిరమణి

తేలప్రోలు(గన్నవరం): ఉంగుటూరు మండలం తేలప్రోలులోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం జిల్లా వనరుల కేంద్రం(డీఆర్‌సీ) ఆధ్వర్యంలో రైతులకు వరి సాగులో చీడపీడలు, తెగుళ్ల నివారణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌సీ డీడీఏ జ్యోతిరమణి మాట్లాడుతూ ప్రస్తుతం వరి చిరుపొట్ట దశలో ఉన్న దృష్ట్యా రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కాండం తొలుచు పురుగు, మెడ విరుపు తెగులు, పొట్ట కుళ్లు వంటి తెగుళ్లు ఆశించకుండా నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. భూసార పరీక్షలకు అనుగుణంగానే రైతులు ఎరువులు వినియోగించాలని ఏడీఏ శ్రీనివాసరావు సూచించారు. మండలంలో ఈ నెలఖారు నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రానున్నట్లు ఎంఏఓ జి.రమేష్ తెలిపారు. ఏఓ పద్మజ, పలువురు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి



వణుకూరులో విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం



కంకిపాడులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నామణి

పెనమలూరు: బాలికలు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్.సులోచనరాణి సూచించారు. వణుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాష్ట్రీయ పోషణమాసం - 2025 కార్యక్రమంలో భాగంగా మూడు నుంచి 10వ తరగతి బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు పౌష్టకాహారం తీసుకోవడమే కాకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆమె సూచించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి.లక్ష్మిసునీత మాట్లాడుతూ కిషోర బాలికల రక్తంలో హెచ్‌బీ, ఎత్తు సక్రమంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న బాలికలను గుర్తించి వారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శులు ఎం.సంఘమైత్రి, కె.భవాని స్వప్న, ప్రధానోపాధ్యాయుడు రఘురామ్, విద్యార్థినులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంకిపాడులో అవగాహన ర్యాలీ

కంకిపాడు: కంకిపాడు పట్టణంలోని ఏడవ అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా మంగళవారం సుపోషిత్ భారత్, సక్షం భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు కలిగి ఉండే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆకుకూరలు ఆహారంగా తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్య తీరుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వారంలో కనీసం రెండు పర్యాయాలు మునగాకు ఆహారంగా తీసుకోవాలని చెప్పారు. నూనె వాడకాన్ని తగ్గించాలని సూచించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త డి.లక్ష్మి, ఎంఎస్‌కే అనూష, తల్లులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన సదస్సు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జీఎస్టీ వల్ల ప్రజల్లో పొదుపు, పారదర్శకత, ప్రాంతీయ అభివృద్ధి, జాతీయ ఆర్థికవృద్ధిని ప్రోత్సహించే విధానమని వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య చెప్పారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ఆవరణలో జీఎస్టీపై అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. సీతారామయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో జీఎస్టీ 2.0 సంస్కరణలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ సదస్సును ఏర్పాటు చేశామన్నారు. జీఎస్టీలో సంస్కరణల వల్ల ప్రయోజనాలు, పన్నుల విధానం గురించి ఆయన విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.